క్లుప్తంగా

కార్ల స్టాండ్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కార్ల డ్రైవర్లు

యర్రగొండపాలెం: కార్ల స్టాండ్ ఏర్పాటు చేయాలని డ్రైవర్లు, యజమానులు బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట తమ వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేశారు. సమస్యపై చర్చించేందుకు తహసీల్దార్ పిలిపించి సమస్యపై చర్చించకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. వెంటనే తమకు ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీ



స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారావు

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెంలో ఉన్న రేషన్ దుకాణాలను తహసీల్దార్ బీవీ రమణారావుతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసరాల వివరాలు ఎప్పటికప్పుడు పట్టికలో నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి నిత్యావసర సరుకు అందేలా చూడాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



వైద్యం కోసం ఎదురు చూస్తున్న రోగులు

మంచంపట్టిన తాళ్లూరు

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- తూతూమంత్రంగా ఫీవర్ సర్వేలు
- రోగులను పట్టించుకోని ప్రభుత్వ వైద్యులు
- ప్రైవేట్ క్లీనిక్‌లకు బారులు తీరిన రోగులు



తూర్పుగంగవరంలో ఓ ప్రైవేట్ క్లీనిక్ వద్ద జ్వరపీడితులు

తాళ్లూరు: మండలంలోని వివిధ గ్రామాలు మంచం పట్టాయి. ప్రతీ గ్రామంలో పది నుంచి 20 మందిని విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. వాతావరణంలో మార్పుల దృష్ట్యా మండల వాసులు విషజ్వరాలతో అల్లాడిపోతున్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం లభించక పోవడంతో ప్రైవేట్ క్లీనిక్‌లను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మరోపక్క పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు ముసురుపై చేరి ప్రజలు జ్వరాల బారిన పడేలా చేస్తున్నాయి. వైద్యులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో విషజ్వరాలపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. అన్నీ కార్యక్రమాలు తూతూమంత్రంగానే నడుస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్తే సరైన వైద్యం అందించడంలో వైద్యులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలకు మెరుగైన వైద్యం కోసం వెళ్తే ఓపీలు చూసి నాలుగు బిళ్లలు ఇచ్చి ఒంగోలు లేదా చీమకుర్తి వైద్యశాలలకు పంపడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ వైద్యులు వైద్యశాలల్లో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అసలు సమయపాలన లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. విషజ్వరాలతో చిన్న పిల్లలు, పెద్దలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు అన్నీ వేళల్లో వైద్యశాలల్లో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నాలుగు రోజుల నుంచి జ్వరం:



నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తోంది. నీరసం, ఒళ్లు నొప్పులుగా ఉన్నాయి. ప్రభుత్వ వైద్యశాల వైద్యులు సరిగా పట్టించుకోవడం లేదు. నాలుగు బిళ్లలు ఇచ్చి ఒంగోలు లేదా చీమకుర్తి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లమని ఉచిత సలహాలు ఇచ్చి పంపుతున్నారు. అంత దూరం వెళ్లలేక మెరుగైన వైద్యం కోసం తూర్పుగంగవరం ఆర్ఎంపీ వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నా.

– ఎస్.సునీత, రెడ్డినగర్

మెరుగైన సేవలందించడంపై శ్రద్ధ చూపాలి

- ప్రభుత్వ వైద్యులకు కలెక్టర్ ఆదేశం



ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ముండ్లమూరు (దర్శి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వ వైద్యులకు సూచించారు. బుధవారం ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగుల రిజిస్ట్రేషన్ రికార్డ్స్, క్యాజువాలిటీ రూమ్‌లు, మెడిసిన్ స్టోరేజీ విభాగం, ల్యాబ్‌ను సందర్శించి సంబంధిత రిజిస్టర్‌లు పరిశీలించి వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 15 రోజుల్లో నమోదైన ఫీవర్ కేసులు, వారిలో ఎంతమందికి పరీక్షలు నిర్వహించారు.. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం 10 ఫీవర్ కేసులు రాగా అందులో 8 మందికి పరీక్షలు నిర్వహించామని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై కలెక్టర్ ఆరాతీశారు. పేద ప్రజల ఆరోగ్యం చాలా కీలకమని, ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని చెప్పారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని వివరించారు. ఎక్కువ మంది ఫీవర్‌తో బాధపడుతూ పీహెచ్‌సీలకు వచ్చే గ్రామాలను వైద్యులు సందర్శించి పరిశీలించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని నానో యూరియా వాడకాలపై రైతులకు కలెక్టర్ అవగాహన కల్పించారు. యూరియా వాడకం తగ్గించి రసాయనిక ఎరువులు, సేంద్రియ వ్యవసాయాలు అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏడీఈ బాలాజీనాయక్, ఏఓ తిరుమలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీపీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైద్యులు డాక్టర్ సుస్మిత, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నిరసన వారాన్ని జయప్రదం చేయాలి



ఏపీటీఎఫ్ కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ పిలుపు మేరకు ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన వారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కోరారు. ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ సబ్ కమిటీ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు తూము శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. నిరసన వారం కరపత్రాలు విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ఏ ఒక్కటీ పూర్తి చేయక నిర్లక్ష్య వైఖరి చూపిస్తోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డీఏలు మంజూరు చేయడం లేదని వాపోయారు. 11 పీఆర్‌సీ, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని, 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నిరసన వారాన్ని కార్యకర్తలు, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని విజప్తి చేశారు. మండల శాఖ అధ్యక్షుడు తూము శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, అనవసర యాప్‌లను రద్దు చేయాలని, నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్లెట్ విధానం ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలిగిస్తోందని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దర్శి మండల శాఖ సబ్ కమిటీ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లు రంగస్వామి, గొర్రెపాటి వేణు, భోగిరెడ్డి శ్రీను, అమరా శ్రీను, సందు వెంకటేశ్వర్లు, పాణ్యం గోవిందయ్య, నరసింహ, పాణ్యం నజీర్, నాదెండ్ల శ్రీను, ముత్యాల శ్రీను, కంటా శ్రీను, సీహెచ్ రమణయ్య, చక్రధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఈఈ



అసంపూర్తిగా నిలిచిన భవనాలను పరిశీలిస్తున్న ఈఈ వెంకటరత్నం

పెద్దారవీడు: మండలం పరిధిలోని పెద్దారవీడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సుంకేసుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గుండంచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరత్నం బుధవారం సందర్శించారు. వెలుగొండ ప్రాజెక్టు కింద ముంపు గ్రామాలైన గుండంచర్ల, సుంకేసుల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మరమ్మతులకు నోచుకోని శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంతో కాలం వెల్లదీస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారని ఎంఈఓ-2 ఎస్‌సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈఈ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు తాత్కాలింగా మరమ్మతులు చేయాల్సి ఉందని, అంచనాలు వేసి నివేదికను తయారు చేసి త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న బాలికల విద్యాలయంలో మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లు, పరిసరాలు పరిశుభ్రం చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. ఆయన వెంట డీఈఈ శ్రీరమణయ్య, ఏఈ తిమ్మారెడ్డి, ప్రిన్సిపాల్ పిబే ఉన్నారు.

ఇద్దరు జర్నలిస్టుల కుటుంబాలకు తాటిపర్తి పరామర్శ



ఖలీల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టులుగా పనిచేస్తున్న వలీసాహెబ్, ఖలీల్‌ల గృహాల వద్దకు ఆయన వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అన్ని విషయాల్లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, ఆర్.అరుణమ్మ ఉన్నారు.

కురిచేడులో ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి బాలశంకరరావు

కురిచేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శానిటేషన్, సోప్‌పిట్స్, యూరియా సరఫరాపై మండల ప్రత్యేకాధికారి డి.బాలశంకరరావు బుధవారం సుడిగాలి పర్యటన చేసి పరిశీలించారు. తొలుత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి వైద్యాధికారి ఎం.సుస్మితారెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్, ఇతర అధికారులతో మాట్లాడారు. యూరియా ఔట్ రీచ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ, జీవన, నానో ఎరువులు వాడాలని సూచించారు. ఒకేసారి కాకుండా ప్రస్తుతం ఎంత యూరియా అవసరమో అంత మోతాదు మాత్రమే తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. ఏఓ సంపత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడితే నేలలు నిస్సారమై ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గడంతో పాటు పర్యావరణం కలుషితం అవుతుందని చెప్పారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తే రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తూ నేలలో సేంద్రియ కర్బన శాతం పెంచుతూ ఖర్చు తగ్గిస్తూ నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. అవసరానికి మించి రైతులు ఎక్కువగా యూరియా వాడితే పైరులో పచ్చదనం పెరిగి పురుగులు, తెగుళ్లు ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. 500 ఎంఎల్ నానో యూరియా-45 కేజీల యూరియా బస్తాతో సమానమని తెలిపారు. యూరియా బస్తాను పైరుకు వేసినప్పుడు 30 శాతం మాత్రమే మొక్క గ్రహించుకుంటుందని, మిగిలినదంతా వృథాగా పోతుందని తెలిపారు. నానో యూరియా వాడితే 80 శాతం వరకు మొక్కలు గ్రహించుకుంటాయని తెలిపారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రసూల్, ఏపీఓ దేవయ్య, కురిచేడు పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అపోహలు వద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీడీ శివప్రసాద్

దర్శి: హెచ్ఐవీపై అపోహలు వద్దని, వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని గ్రాండ్ టీవి పీడీ శివప్రసాద్ సూచించారు. స్థానిక పొట్టి శ్రీరాములు కాలేజీలో గ్రాండ్ టీవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శివప్రసాద్, ఏఎన్ఎం ప్రీతి, ఓఆర్‌డబ్ల్యూ శిరీషా హెచ్ఐవీ వ్యాధి కంట్రోల్ చేసుకునేందుకు పలు సూచనలు, సలహాలు అందించారు. హెచ్ఐవీ కంట్రోల్ చేసుకునేందుకు ఏఆర్‌టీ మెడిసిన్ ఉందని, క్రమం తప్పకుండా మెడిసిన్ వాడినతే వారి జీవన కాలం పెంపొందించుకోవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయుల మానవత్వం



పవన్ తల్లికి నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: సెలవుల్లో ఈతకు వెళ్లి దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన 9వ తరగతి విద్యార్థి పులుకూరి పవన్‌కుమార్ కుటుంబానికి పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది తమ వంతు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. జమ్మిదోర్నాలకు చెందిన పవన్‌కుమార్ తండ్రి చాలా కాలం క్రితం చనిపోయాడు. తల్లి కూడా కంటి చూపు లేక ఇబ్బందులు పడుతోంది. ఆ కుటుంబం పేదరికంలో అవస్థలు పడుతూ కుమారులను చదివించుకుంటోంది. దురదృష్టవశాత్తు పవన్‌కుమార్ ఈతకు వెళ్లి మృతి చెందాడు. స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లెకోన ప్రసన్నతాంజలి, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం పవన్‌కుమార్ కుటుంబానికి అండగా నిలిచారు. ఉపాధ్యాయులు తమ వంతు సాయంగా 31 వేల రూపాయలు పవన్ తల్లికి అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన ఉపాధ్యాయులకు పవన్ తల్లి కృతజ్ఞతలు తెలిపింది.

వ్యాధిగ్రస్థునికి మానవత చేయూత



కృష్ణను పరామర్శిస్తున్న మానవత సభ్యులు

దర్శి: స్థానిక అద్దంకి రోడ్‌లోని ఆటోనగర్‌లో 15 రోజుల క్రితం పక్షవాతంతో కుడి కాలు, చెయ్యి పడిపోయి మంచానికే పరిమితమైన లారీ డ్రైవర్ ఉయ్యాల కృష్ణ దీనస్థితికి మానవత సభ్యులు స్పందించారు. ఆయనకు రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాదరావు, కో చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి వేణు, ఈసీ హెల్త్ మెంబర్ సుశీల, సంస్థ ప్రతినిధులు రోషారావు, ఏడుకొండలు, నాగరాజు తదితరులు చెక్కును కృష్ణ భార్యకు అందజేశారు.

నానో యూరియా వాడాలి



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రాధ

దర్శి: యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని ఏఓ రాధ సూచించారు. మండలంలోని పాతకమూరులో యూరియా ఔట్ రీచ్ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ యూరియాను తగ్గించి నానో యూరియా వాడకం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా భూములు సారవంతం కోల్పోకుండా ఉంటాయన్నారు. వ్యవసాయాధికారులు, రైతుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

అన్ని సర్వేల్లోనూ తాళ్లూరు మండలం వెనుకంజ

తాళ్లూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని సర్వేల్లోనూ తాళ్లూరు మండలం వెనుకంజలో ఉందని మండల స్పెషలాఫీసర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో బుధవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ ఎంపీడీవో స్వామిత్ర సర్వేను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రజా సమస్యల కార్యక్రమాలకు గైర్హాజర్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా రిపీట్ చేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరు మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ఎస్.సత్యం, తహసీల్దార్ బీవీ రమణారావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరావు